క్లుప్తంగా

నేడు మండల సమావేశం

వీరబల్లి : మండల సర్వసభ్య సమావేశం బుధవారం (నేడు) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు. అలాగే మండలస్థాయి అధికారులు మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని కుర్నూతల గ్రామం, దేవలంపల్లిలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నేడు బుధవారం గణపతి పూజతో మొదలై 21న గురువారం శ్రీ చెన్నకేశవస్వామి ఉత్సవం, 22న శ్రీలక్ష్మీనారాయణ మహా సుదర్శన హోమాలు, 23న ఉత్సవ విగ్రహ అలంకరణ, 24న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి కళ్యాణం నిర్వహించబడునని కమిటీ సభ్యులు తెలియజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : రాజంపేట డిపో మేనేజరు కార్యాలయంలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఆర్టీసీపరంగా అందిస్తున్న సేవలు, అవసరమైన సేవలు, ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

విద్యార్థులకు 'పిల్ పజిల్'



పిల్ పజిల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

రాజంపేట : రాజంపేట అన్నమాచార్య ఫార్మసీలో 'పిల్ పజిల్' కార్యక్రమాన్ని మంగళవారం జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా నిర్వహించారు. 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఔషధాలు, వాటి తయారీ విధానం, మందు మోతాదు, మార్కెట్ బ్రాండ్ నేమ్, జనరిక్ నేమ్ ఉపయోగాలు, వృద్ధులకు ఉపయోగించే వాటిపై ప్రత్యేక పజిల్ కార్యక్రమం డా.గిరి, డా.ప్రమోద్‌ల పర్యవేక్షణలో జరిపారు.

అవ్వతాతలను బాగా చూసుకోవాలి

సంబేపల్లె : వృద్ధాప్యంలో ఉన్న అవ్వాతాతలను బాగా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబంలోని ప్రతి ఒక్కరిపై ఉందని సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సూచించారు. ప్రతి రోజు పాఠశాలలో ఒక వినూత్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులు స్కిట్ ప్రదర్శించారు. అవ్వాతాతలను సరిగా చూడకుండా వారిని వృద్ధాశ్రమంలో చేర్చడానికి ప్రయత్నిస్తున్న అమ్మానాన్నలకు కనువిప్పు కలిగేలా పిల్లలు మాట్లాడిన తీరుపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను చైతన్యం చేస్తాం

గాలివీడు : రైతుల సమస్యలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఉద్యాన శాఖ టి.నాగమణి అన్నారు. మంగళవారం మండలంలోని ఎగువగొట్టివీడు, గోరాన్ చెరువు గ్రామాల్లో మామిడి పూత, పిందె సమయంలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు పంచాయతీలో కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల దేవాలయంలో నేడు (బుధవారం) విగ్రహాల ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డిలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

స్టీల్ గ్లాసులు వితరణ

పుల్లంపేట : మండలంలో దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 50 మంది విద్యార్థులకు రాగిజావా, మంచినీరు తాగడానికి స్టీల్ గ్లాసులను గ్రామ సర్పంచ్ బోదనపు హలీమా, సిద్దు దంపతులు వితరణగా అందజేశారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి

రాయచోటి టౌన్ : మైనర్లకు వాహనాలు ఇస్తే ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి పిల్లల తల్లిదండ్రులను హెచ్చరించారు. మంగళవారం పట్టణ పరిధిలోని రింగ్‌రోడ్డుపై స్కూటర్లు నడుపుతున్న మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. 19 ద్విచక్రవాహనాలు సీజ్ చేశారు. వాటికి సంబంధించిన యజమానులను పిలిచి మొదటిసారి కావడంతో కౌన్సెలింగ్ చేశారు. స్కూటర్‌లపై కేసు నమోదు చేసి వాటిపై జరిమానా విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇకపై చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

సంక్షేమ హాస్టళ్లు.. అవస్థల నిలయాలు

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అద్దె భవనంలోనే పలు హాస్టళ్ల నిర్వహణ
- ప్రహరీ లేక భయం గుప్పెట్లో విద్యార్థులు
- చోద్యం చూస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రామాపురం: ఇరుకు గదిలో భోజనం చేస్తున్న విద్యార్థులు

సాక్షి విజిట్



రాజంపేట టౌన్: ఎస్సీ బాలుర హాస్టల్‌లో డోర్‌లు లేని మరుగుదొడ్లు



సంబేపల్లె: కిటికీకి చెక్కలు లేని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహం

రాజంపేట టౌన్ : రాజంపేట మండలంలో నాలుగు బీసీ, నాలుగు ఎస్సీ హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో తాళ్లపాకలో ఉన్న బీసీ బాలుర హాస్టల్, పట్టణంలోని బీసీ బాలుర, బాలికల కళాశాల హాస్టల్స్, ఎస్సీ బాలుర, బాలికల కళాశాల హాస్టల్స్ అద్దె భవనాల్లోనే ఉన్నాయి. అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టల్స్‌లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లపాకలోని బీసీ బాలుర హాస్టల్‌లో సౌకర్యాలు లేకపోవడంతో అక్కడి విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లి పడుకోవాల్సి వస్తోంది. ప్రధానంగా అద్దె భవనాల్లో నడుస్తున్న బాలికల హాస్టల్స్‌లో భద్రత గాలిలో దీపంలా ఉంది. వత్తలూరు రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌లో సమస్యలు అన్నీఇన్నీ కావనే చెప్పాలి. అక్కడి హాస్టల్‌లోని పలు గదులకు కిటికీ రెక్కలు లేకపోవడంతో విద్యార్థులు చలికి వణుకుతూ, దోమల బెడదను తట్టుకుంటూ వర్షం కురిస్తే గదులు ఉరుస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే యాభై రెండేళ్ల క్రితం నిర్మించిన ఎస్సీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకుంది. ఆ హాస్టల్‌లోని గదులు పైపెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. మరుగుదొడ్లకు డోర్‌లు లేకపోవడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో దాదాపు 330 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్‌లో పది మంది వర్కర్లు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు వర్కర్లు మాత్రమే ఉన్నారు. ముగ్గురిలో ఒకరు దివ్యాంగురాలు కావడంతో ఇద్దరు వర్కర్లే 330 మంది విద్యార్థులకు ఆహార పదార్థాలను చేయాల్సి వస్తుంది. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు మినహా ఏ హాస్టల్‌లోనూ సీసీ కెమెరాలు లేవు.

ఆరు నెలలుగా అందని మెస్ చార్జీలు

రాయచోటి టౌన్ : బీసీ హాస్టల్ విద్యార్థులకు ఆరు నెలలుగా మెస్ చార్జీలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులతో అల్లాడుతున్నారు. రాయచోటిలో బీసీ హాస్టల్ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గతంలో ఉన్న బీసీ హాస్టల్‌ను తొలిగించి ఇంటిగ్రేటెడ్ భవనాన్ని నిర్మించాలని దాదాపు 16 సంవత్సరాల క్రితం గోడల వరకు నిర్మించి అక్కడే వదిలేశారు. ఆ తరువాత దానిని పట్టించుకోకపోవడంతో అద్దె భవనాలలో నిర్వహిస్తూవచ్చారు. అద్దె భవనాలకు అద్దె చెల్లించలేక హాస్టల్ నిర్వహణ భారం ఎక్కువ కావడంతో గత ప్రభుత్వం రాజంపేట రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న సిరికల్చర్ భవనంలో బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేసింది. ఈ భవనం ఊరికి దూరంగా ఉండటమే కాకుండా చుట్టూ గుండ్లు, ముళ్ల పొదలు ఉన్నాయి. హాస్టల్‌కు ఎలాంటి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు భయం భయంగానే నివాసం ఉంటున్నారు. అయితే వార్డెన్ చొరవతో రెండు సంవత్సరాల క్రితం భవనాల లోపలే విద్యార్థులకు బయటికి వెళ్లడానికి వీలు లేకుండా అడ్డు గోడ నిర్మించారు. ఈ హాస్టల్‌లో మొత్తం 103 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్ నిర్వహణకు ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల కొరత వేధిస్తోంది.

సంబేపల్లెలో..

సంబేపల్లె : సంబేపల్లె మండలంలో బీసీ, ఎస్సీ ఎస్టీ బాలుర వసతి గృహాలతో పాటు కస్తూర్బా, బీఆర్ అంబేడ్కర్ బాలికల వసతి గృహాలలోని విద్యార్థులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఇంత వరకు బీసీ బాలురకు ప్రభుత్వ వసతి భవనం నిర్మించలేదు. అద్దె భవనంలో విద్యార్థులు ఉంటున్నారు. కిటికీలకు మెష్‌లు సక్రమంగా లేకపోవడం, దోమతెరలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి వసతి గృహాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు కోరుకొంటున్నారు.

అపరిష్కృతంగా గిరిజన వసతి గృహ సమస్యలు

సుండుపల్లె : మండల పరిధిలోని సుండుపల్లె, జికె రాచపల్లిలోని సాంఘిక గిరిజన గురుకుల పాఠశాల హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. హాస్టల్‌లోని కొన్ని గదులలో ఫ్లోరింగ్, మరికొన్ని గదులలో స్లాబ్‌లు దెబ్బతిన్నాయి. అలాగే విద్యార్థులు వంట గదులలో అవస్థలు పడుతున్నారు. గదులలో కిటికీలకు తలుపులు, మెష్‌లు లేకపోవడంతో దోమల బెడదను ఎదుర్కొంటున్నారు. అలాగే శుద్ధి చేసిన తాగునీరు లేక హాస్టల్ వార్డన్లు బయట నుంచి వాటర్ క్యాన్లను తెప్పించుకొని విద్యార్థులకు నీటిని అందజేస్తున్నారు. హాస్టళ్లకు ప్రధాన గేటు, మౌళిక సదుపాయాలు కల్పించాలని హాస్టల్ విద్యార్థులు కోరుతున్నారు.

అవస్థల నడుమ గురుకుల పాఠశాల

నందలూరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వర్షాలకు స్కూల్ ప్రహరీ గోడ పడిపోవడంతో అడవి పందులు, పాములు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయని, ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఏ.హైమావతి కోరారు. తమ పాఠశాలలో ఐదోతరగతి నుంచి పదోతరగతి వరకు 457 మంది విద్యార్థులు ఉన్నారని, అలాగే ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ 124 మంది విద్యార్థులు ఉన్నారని వీరికి కాస్మోటిక్ చార్జీలు రావడం లేదని, బోరు వాటర్ వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయడంలేదని, కొత్త ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కొందరు విద్యార్థులు జ్వరాలబారిన పడ్డారని, వారికి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయిస్తున్నామన్నారు. జ్వరాలు తగ్గనివారికి పేరెంట్స్‌ను పలిపించి ఇంటికి పంపిస్తున్నామని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ తెలిపారు. మూడు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు లేవని, ప్రభుత్వం నుంచి మెయింటినెన్స్ డబ్బులు రావడం లేదని సంబంధిత అధికారులు పై సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

దారుణావస్థలో లక్కిరెడ్డిపల్లె హాస్టళ్లు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని ఎస్సీ - 1, 2, బాలికలు, బీసీ బాలికలు, దేవంలపల్లి బీసీ బాలుర వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎస్సీ వన్ బాలుర, బాలికల వసతి గృహాలు పై పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు వసతిగృహాలలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. దుప్పట్లు, ట్రంకు పెట్టెలు ప్రభుత్వం అందించలేదని విద్యార్థులు వాపోతున్నారు. అలాగే కాస్మోటిక్ చార్జీలు అకౌంట్‌కు జమ కాలేదని, సొంత డబ్బులతోనే కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు. బిసి బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు దుర్వాసన భరించలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఎస్సీ బాలుర వసతి గృహాలు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఆనుకొని ఉండటంతో సమీపంలోనే శవ పంచనామా గది నుంచి వచ్చే దుర్వాసనతో భరించలేకున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేస్తే సదుపాయాలు కల్పిస్తామని వసతి గృహ హెచ్‌డబ్ల్యూఓ తెలిపారు.

దీనస్థితిలో వసతి గృహాలు

రామాపురం : సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో వసతుల కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదు. మండలంలో కస్తూర్బా, ఆదర్శ, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, నీలకంఠ్రావుపేటలో ఎస్సీ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో సుమారు 3వేలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇవి ఊరికి బయట మామిడి తోటలు, పంట పొలాల నడుమ వీటి నిర్మాణాలు ఉండటంతో విష పురుగుల బెడద తీవ్రంగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. మరుగుదొడ్లు, డార్మెటరీలు ఏమాత్రం సక్రమంగా లేవు.



నందలూరు: ఆడపూరు గురుకుల పాఠశాలలో పడిపోయిన ప్రహరీ గోడ



సుండుపల్లె: జీకే రాచపల్లి గిరిజన బాలుర హాస్టల్‌లో పెచ్చులూడిన స్లాబ్

పీజీఆర్ఎస్ పిటిషన్లను పరిష్కరించాలి



చక్రంపేట వంకను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెనగలూరు : పీజీఆర్ఎస్ పిటిషన్లను గుణాత్మక పద్ధతిలో పరిష్కరించాలని సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి తెలిపారు. మంగళవారం పెనగలూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆమె సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది ప్రజల నుంచి వచ్చే పిటీషన్లను వెంటనే పరిష్కరించి తగు న్యాయం చేయాలని కోరారు. పలు సమస్యలపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతకుముందు చక్రంపేట దగ్గర ఉన్న వంక ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు రావడంతో వంక వద్దకు స్వయంగా వెళ్లి పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్నారు.

ఉద్యోగులను తొలగించడం అన్యాయం

ఓబులవారిపల్లె : ముందస్తు సమాచారం లేకుండా ఏపీఎండీసీ ఉద్యోగులను తొలగించడం అన్యాయమని రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పార్టీలకతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఉద్యోగులను తొలగించడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని మండిపడ్డారు.తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

వెలిగల్లును హంద్రీ-నీవాతో అనుసంధానం చేయాలి

గాలివీడు : హంద్రీ-నీవా నీటిని వెలిగల్లు జలాశయానికి అనుసంధానం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గాలివీడు పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌ను వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వెలిగల్లు ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉన్నందున భవిష్యత్తు అవసరాల దృష్ట్యా హంద్రీ-నీవా పథకంతో అనుసంధానం చేయాలన్నారు. అంతేగాక వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువలు పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని మండలాల్లో తాగు, సాగునీటిని అందించి, చెరువులను నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకట్రామిరెడ్డి, చక్రవర్తి పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్ : ఈ నెల 22న నిర్వహించే జాబ్ మేళాను యువతీయువకులు సద్వినియోగం చేసకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోడెం వీరాంజనేయప్రసాద్ అన్నారు. మంగళవారం రాయచోటి లోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి జాబ్ మేళా వివరాలు వెల్లడించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే కరువు ప్రాంతంగా, వెనుకబడిన ప్రాంతంగా రాయచోటి ముందు వరసలో నిలుస్తుందన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని తన కార్యాలయం వద్దనే ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు 9652285027ను సంప్రదించాలన్నారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించాలి



పెనగలూరులో కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీఓ



ఒంటిమిట్ట: కార్మికులను సన్మానించిన అధికారులు

పెనగలూరు : మండలంలోని ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించాలని ఎంపీడీఓ విజయారావు అన్నారు. మంగళవారం పెనగలూరు పంచాయతీలోని గ్రీన్ అంబాసిడర్లను ఆయన ఘనంగా సన్మానించారు.

ఒంటిమిట్ట : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒంటిమిట్టలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఒంటిమిట్ట ఎంపీడీఓ సోమశేఖర్ హాజరయ్యారు. పారిశుద్య కార్మికులకు ఎంపీడీఓ చేతులమీదుగా ఒక్కొక్కరికి 25 కేజీలు బియ్యం అందజేశారు. అనంతరం వారిని పూలమాలతో సత్కరించారు.



పారిశుధ్య కార్మికులను సన్మానించిన నాయకులు

పుల్లంపేట : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం పుల్లంపేట గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఉక్కు మహిళ ఇందిరాగాంధీ

రాయచోటి అర్బన్ : భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఉక్కు మహిళగా పేరుగాంచిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా చీఫ్ సెక్రటరీ అమీర్ బాషా అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందిర చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మహిళగా ఇందిరాగాంధీ గుర్తించబడిందన్నారు. విప్లవాత్మకమైన, సాహసోపేతమైన నిర్ణయాల ద్వారా దేశ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడిన ఉక్కుమహిళ ఇందిరాగాంధీ అని అన్నారు.

కుంటలు, చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

రామాపురం : మండలంలోని చెరువులు, కుంటలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హసనాపురం పంచాయతీ చింతలవాండ్లపల్లి సమీపంలోని కుంటను కొందరు వ్యక్తులు ఆక్రమించడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్‌ఓ వెళ్లి ఆక్రమణదారులను అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో సోమవారం అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు విశేషంగా పూజా కార్యక్రమాలను జరిపారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పూజలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి కరుణ ప్రజలపై ఉండి ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని ఆకేపాటి ఆకాంక్షించారు.

కబ్జాదారులపై కేసు నమోదు చేయాలి

ఓబులవారిపల్లె : పుల్లంపేటలో రాత్రికి రాత్రి శ్మశాన ప్రహరీ గోడ కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజుల భాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాత్రికి రాత్రే భూ కబ్జాదారులు ప్రహరీ గోడను పడగొట్టి చదును చేసి కబ్జాకు పాల్పడ్డారన్నారు. ప్రహరీ గోడ కూల్చిన వారి చేతనే గోడను నిర్మించాలని, అంతేకాకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు కబ్జాదారులపై కేసులు నమోదు చేయని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు.

జెడ్పీహెచ్ఎస్ తనిఖీ



విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

రామాపురం : మండలంలోని కొండవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో జరగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై పాఠశాలలో సబ్జెక్టు బోధన విధానాలను పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణపై హర్షం వ్యక్తం చేశారు.

తపాలా శాఖలో ప్రీమియం ఖాతాలు

రామాపురం : ఏ బ్యాంక్‌లో ఖాతా లేని వారు లబ్ధిదారులు తపాలా శాఖ వారి ఐపీపీబీ ప్రీమియం ఖాతాను తెరుచుకోవచ్చునని కడప సౌత్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అన్ని తపాలాశాఖల్లో లేదా మండల కేంద్రంలో జరిగే ప్రత్యేక శిబిరంలో నూతన ఖాతాలను, లేదా ఆధార్ లింగ్ చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

అసాంఘిక పనులకు అడ్డాగా మార్కెట్ యార్డ్

రాయచోటి అర్బన్ : జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డును ప్రభుత్వం అన్నిరకాలుగా అభివృద్ధి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.రామచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డు పరిసరాలను రైతుసంఘం నేతలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు సరైన ప్రహరీ గోడ, ప్రధాన గేటు లేక అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. యార్డులో రైతుల నుండి ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు, విక్రయాలు చేపట్టకపోవడంతో అభివృద్ధి అటకెక్కిందన్నారు. యార్డును అధికారులు కేవలం పశువుల సంతగా మాత్రమే వినియోగిస్తున్నారన్నారు. దీంతో రైతాంగం కోసం నిర్మించిన శీతల గిడ్డంగులు నిరుపయోగంగా మారాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణలేమి కారణంగా వ్యవసాయ ల్యాబ్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అభద్రతాభావంతో ఉన్నారంటూ తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి యార్డుకు ప్రహరీగోడను నిర్మించడంతోపాటు యార్డును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇదే సమయంలో ఇతరులను యార్డులోకి అనుమతించకుండా చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

డిసెంబర్ 15లోపు పంట బీమా చెల్లించాలి

చిన్నమండెం : రైతులు పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీలత తెలిపారు. చిన్నమండెం మండల పరిధిలోని దేవగుడిపల్లె, చిన్నమండెం-1 గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారి శ్రీలత మాట్లాడుతూ పంటలు నష్టపోయినా బీమా ద్వారా రైతుకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులు ప్రీమియం రుసుము చెల్లించేందుకు డిసెంబర్ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందన్నారు. వరి పంటకు డిసెంబర్ 31వ తేదీ వరకు ఎకరాకు రూ.126, టమాటా పంటకు ఎకరాకు రూ.160, వేరుశనగ పంటకు ఎకరాకు రూ.96 డిసెంబర్ 15లోపు బ్యాంకుల్లో బీమా ప్రీమియం చెల్లించాలని తెలియజేశారు. రబీలో సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా గ్రామ వీఏఏల ద్వారా చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గీత, కేవీకే శాస్త్రవేత్త పీరూ సాహెబ్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోండి

రాయచోటి టౌన్ : డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి అన్నారు. మంగళవారం ఆయన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి జిల్లా కోర్టు పరిధిలోని అన్ని మండలాలకు చెందిన పోలీస్ స్టేషన్ల పరిధికి చెందిన కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా సమస్యల పరిష్కారం చేసుకోవాలని కోరారు. సివిల్, క్రిమినల్, రోడ్డు ప్రమాదాలు, చెక్‌బౌన్స్ కేసులు, ఎన్ఐ యాక్ట్ వంటి కేసుల పరిష్కార వేదికగా ఈ లోక్ అదాలత్ ఉంటుందని, అందుకు న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఈ.ప్రసన్న అన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి జీసీ ఆసీఫా సుల్తానా, రాయచోటి బార్ అసోషియషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసుల రెడ్డి, సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాసులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రాయచోటి టౌన్ : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని రాయచోటి వ్యవసాయశాఖ అధికారి దివాకర్ విత్తన విక్రయదారులను హెచ్చరించారు. రబీ సీజన్ కోసం విత్తనాలు విక్రయించేందుకు సిద్ధం చేసిన ఫర్టిలైజర్స్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్త రకం వరి విత్తనాలను లాట్‌ల ప్రకారం సేకరించి విత్తనాలను ల్యాబ్‌కు పరిశీలనకు పంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షాపులలో వరి, ఇతర విత్తనాలు విక్రయిస్తుంటారని వీరు విక్రయించే సమయంలో జన్యుపరమైన లోపంతోనో, లేక నకిలీ విత్తనాలు అమ్మితే వాటిని విత్తుకున్న రైతులు నష్టపోతారని చెప్పారు. పరీక్షల అనంతరం నివేదికల ఆధారంగా విక్రయాలకు అనుమతులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్టు ఫిర్యాదు అందితే విక్రయించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చిరించారు.

సులభ పద్ధతిలో బోధించాలి

నందలూరు : ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థి స్థాయికి తగ్గట్లు బోధన చేసి సబ్జెక్టు నేర్పించాలని నందలూరు హైస్కూల్ ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ షేక్ రౌఫ్ బాషా కోరారు. నందలూరు మండలంలో పనిచేస్తున్న హైస్కూల్ ఉపాధ్యాయులకు మంగళవారం స్థానిక హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులపై అధిక ఒత్తిడి ఉందని, అయినా కూడా విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కష్టపడి వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో ఆచరించాలని, కృత్యాధర పద్ధతిలో విషయ పరిజ్ఞానాన్ని అందించాలని, బోధన ఉపకరణాలు, డిజిటల్ క్లాస్ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సుండుపల్లె : మండల పరిధిలోని గుల్లావాండ్లపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ జూదం ఆడుతున్న 7 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 6,120లు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



జూదరులను అదుపులోకి తీసుకుంటున్న ఎస్ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది